# 37

# ఉడుకు రక్తం

"నమస్కారం సార్"

చదువుతున్న పేపరులోంచి తలపైకెత్తి చూచాను. పాతికేళ్ళ యువకుడు. ప్యాంటు, షర్టుతో చాలా స్మార్టుగా కనిపిస్తున్నాడు. ఆ అబ్బాయిని ముందెన్నడూ చూచిన జ్ఞాపకంలేదు.

"కూర్చో" అన్నాను, కుర్చీవైపు చేయిచూపించి.

కొంచెం తటపటాయించి కూర్చున్నాడు. ఇద్దరిమధ్య కాసేపు నిశ్శబ్దం నెలకొంది. నేనొక్కణ్ణే వున్నాననుకొని కాఫీ తెచ్చిన మా ఆవిడ కొత్త వ్యక్తిని చూచి కాస్త తడబడ్డది.

"ఆ అబ్బాయికివ్వు కాఫీ" అన్నాను.

"ఫరవాలేదు సార్. మీరు తీసుకోండి"

మా ఆవిడ అతనికి కాఫీ అందించి, నాకు కాఫీ తేవడానికని ఇంట్లోకి వెళ్లింది.

"ఏవూరు?" అడిగాను.

"అంకిరెడ్డిపల్లె" అన్నాడా అబ్బాయి కాఫీ చప్పరిస్తూ.

ఆ పల్లె మావూరికి దగ్గరే. మహావుంటే ఇరవైకిలోమీటర్లు. మావూరి మీదుగానే అక్కడికి బస్సుపోతుంది. ఆ పల్లెలో చాలామంది నాకు తెలుసు.

"ఎవరబ్బాయివి?" అన్నాను.

ఆ అబ్బాయి సమాధానంకోసం ఒక క్షణం ఆగి, "మా నాన్నగారు బయట తిరిగే మనిషికాదు. మీకు తెలిసివుండే అవకాశం లేదులెండి సార్"

అది నిజమే. తన పని తాను చేసుకుపొయ్యేవాడు బయటి ప్రపంచానికి తెలియదు.

"ఏం పనిమీద వచ్చావు?"

అతను వెంటనే సమాధానం చెప్పలేదు. కాఫీ త్రాగడం ముగించి కప్పుకింద పెట్టాడు. పాంట్ జేబులోంచి కర్చీఫ్ తీసి ముఖము తుడుచుకుంటూ.

"మీరు నాకొక చిన్న సాయం చెయ్యాలి" అన్నాడు.

ప్రవృత్తిరీత్యా నేను కథానికా రచయితను. వృత్తి వ్యవసాయం. కాకపోతే మావూరికి ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్‌ని. నాతో అతనికి కాగల సహాయం ఏమిటో అర్థం కాలేదు.

"చెప్పు బాబూ! ఏం సాయం చెయ్యాలో" అన్నాను.

"కోరమండల్ ఫ్యాక్టరీలో అకౌంటెంట్ పోస్టులకు ఇంకో పదిహేను రోజుల్లో ఇంటర్వ్యూలు జరుగుతాయి. నాకు ఇంటర్వ్యూ కార్డు కూడా వచ్చింది. మీరు" ఎమ్.ఎల్.ఏ. గారికి ఉత్తరం రాస్తే నా పని జరిగిపోతుంది".

ఆ జవాబు విని నాకు నవ్వు వచ్చింది. నవ్వు ఆపుకొని అన్నాను, "నేను ఉత్తరం రాయిస్తే పని జరుగుతుందని నీతో ఎవరు చెప్పారు."

"నాకు తెలుసు సార్. మన ఎమ్మెల్యే గారికి మీరంటే అంత గౌరవభావం వుంది."

ఆ అబ్బాయికి జీవితానుభవం లేదు. ఎమ్మెల్యేలు ఎవరిని గౌరవించరు? అవసరమొచ్చినపుడు సబ్బండు కులాల వారికి కొంగదండాలు పెడతారు. వాళ్ళపబ్బం గడుపుకుంటారు. ఆ తర్వాత వాళ్ళందరికీ పనులు చేసి పెట్టాలని ఎక్కడ రాసిపెట్టారు? ఐనా, మునిగిపోయేవాడు ఒక పూచికపుల్ల దొరికితే పట్టుకుంటాడు. అతను నా సాయం కోరడం అట్లాంటిదేనేమో!

ఉత్తరం రాయక తప్పలేదు. లెటర్‌హెడ్ తీసుకుని రెండు ముక్కలు రాసి కవర్లో పెట్టి ఇచ్చాను. ఏదో పెద్ద ఘనకార్యం సాధించినపుడు కలిగే తృప్తిలాంటిది నా అనుభూతిలోకి వచ్చింది. ఉత్తరం తీసుకొని వెళ్తాడనుకొన్నాను. కానీ అలా జరగలేదు. కొంచెంసేపువుండి,

"మీ కథలు చదివాను సార్" అన్నాడు.

ప్రతి రచయితలోనూ వుండే బలహీనత నాలోనూ వుంది. నా కథలు చదివానని అతడనగానే నా ప్రాణం లేచివచ్చింది.

"మరి యీ మాట ముందే అనలేదేం." అన్నాను సంతోషంగా.

"ముందు మీ కథల ప్రస్తావనతెచ్చి రెకమెండేషన్ వుత్తరం అడిగాననుకోండి. కాకా పడుతున్నాననుకొనే ప్రమాదం వుంది" నవ్వుతూ అన్నాడు.

అతని నిజాయితీ నన్ను ముగ్ధుణ్ణి చేసింది. చాలాసేపు సాహిత్యాన్ని గురించి మాట్లాడాడు. అతనికున్న సాహిత్య పరిజ్ఞానంకూడా అల్పమైందేమీ కాదు. తెలుగు సాహిత్యాన్ని గురించి, ఇంగ్లీషు

సాహిత్యాన్ని గురించి అనర్గళంగా అతను మాట్లాడుతూంటే విని నాకాశ్చర్యం కలిగింది.

"చిన్న వయసుగదా నీది. ఇన్ని పుస్తకాలు ఎట్లా చదవగలిగావు?" అని నేనంటే, "ఇంకా చిన్న వయసేమిటిసార్. ఇరవై ఎనిమిదేండ్లు" అన్నాడు.

"పెళ్లయిందా?" అడిగాను.

"పెళ్ళా? ఉద్యోగంలేదు. ఆస్తిపాస్తులు లేవు. ఏ అర్హత చూచి నాకు పిల్లనిస్తారు సార్. అంత పిచ్చోళ్ళు ఎవరున్నారు" అన్నాడు నవ్వి.

"అదేమిటి అలా అంటావు. ఈ రోజుల్లో పిల్లనివ్వడానికి అర్హత ఒంటిపురి మొలతాడు ఒక్కటి చాలు. ఆడపిల్లలున్న తండ్రులు నేనంటే నేను ముందని తోసుకొని వచ్చి క్యూలో నిలబడరా?" అన్నాను.

నా మాటకు అతను పగలబడి నవ్వాడు.

"మీరన్నది నిజమేననుకోండి సార్. చాలామంది కట్నంతో పిల్లనివ్వడానికి సిద్ధంగా వున్నారు. తాను దూరడానికే కంతలేదు. మెడకు ఒక డోలు అని నిరుద్యోగంతో నేనే నానా అగచాట్లూ పడుతున్నాను. మరొక ప్రాణిని కూడా బాధపెట్టడం, యిల్లు నరకం చేసుకోవడం ఎందుకని చేసుకోలేదు."

"పోన్లే. సాహిత్యంపట్ల అభిరుచి ఎట్లా కలిగింది" అడిగాను.

"సాహిత్యం నాకొక వ్యసనంలాగా తయారయిందిసార్. గోళ్లు గిల్లుకుంటూ వూరికే కూర్చుంటే జీవితభయం నీడలా వెంటాడుతుంది. తండ్రి పెరాలసిస్‌తో మంచం పరమైపోయాడు. అమ్మ కూలీనాలీ చేస్తుంది. చెట్టంత కొడుకు చదువుకొనీ ప్రయోజనం లేకపోయింది. ఏ రైలు కిందనో తలదూర్చాలన్నంత నిస్పృహ కలుగుతుంది. ఆ నిస్పృహ నుండి బయటపడటానికి పుస్తకాల్ని ఆశ్రయించాను. రోజుకు పది గంటలు పండ్రెండు గంటలు కూడా చదువుతాను" అన్నాడు నిట్టూర్చి.

"బ్యాంకులో లోన్ తీసుకొని ఏదన్నా స్వయం ఉపాధి వెదుక్కోకూడదా" అన్నాను.

"బ్యాంకువాళ్లు అందరికీ లోన్ ఇవ్వరు. దానికి కొంత రాజకీయ ప్రాపకం ఉండాలిసార్. ఈ రోజుల్లో ప్రతిదీ రాజకీయమైపోయింది."

దేశానికి ఉపయోగపడవలసిన యువత నిర్వీర్యమైపోతున్నది. వాళ్ల హృదయాల్లో నిరాశా నిస్పృహలు చోటుచేసుకుంటున్నవి. రాజకీయ నాయకులకు అదే పట్టదు. వాళ్ల పరమ లక్ష్యం పదవులు, ధనసంపాదన. ఇక ఈదేశం ఎప్పుడు ఎట్లా బాగుపడుతుందో అన్న ఆలోచనలో పడ్డాను.

"వస్తాను సార్!" అంటూ ఆ అబ్బాయి లేచాడు.

నేను వాకిలి వరకూ వచ్చి, "ఎమ్మెల్యేగారు ఏమన్నారో మళ్లీ ఒకసారి నాకు కనబడి చెప్పు. మరిచిపోకు" అన్నాను.

"అలాగే సార్" అంటూ సెలవు తీసుకున్నాడు.

అతనిపట్ల ఎందుకనో నాకు ఒకరకమైన ఆత్మీయత ఏర్పడింది. రెకమెండేషన్ లెటర్ స్ట్రాంగ్‌గా రాయలేకపోయినందుకు బాధపడ్డాను. నిజానికి ఆ ఉత్తరం చాలా ఫార్మల్‌గా రాశాను. అబ్బాయి ఉత్తరం అడగ్గానే నాలో చిన్నసైజు రాజకీయ నాయకుడు ఆవహించాడు. హృదయం పనిచెయ్యడం మానుకుంది. తలపనిచేసింది. "ది బేరర్ ఆఫ్ దిస్ లెటర్ ... అంటూ ప్రారంభించి, ప్లీస్ డూ ది నీడ్‌ఫుల్.. అంటూ ముచ్చటగా మూడు ముక్కలు రాసి ఉత్తరం ముగించి ఆ అబ్బాయికిచ్చాను. అదే మహాభాగ్యమన్నట్లు ఆ అబ్బాయి వెళ్ళిపోయాడు. ఏదో అపరాధం చేసినట్టు ఫీలయ్యాను. కాసేపు కాలుగాలిన పిల్లిలా అటూ ఇటూ తిరిగాను. ఇక ఉండబట్టలేక కండువా భుజాన వేసుకొని మా యింటికి దగ్గరలోనేవున్న రామిరెడ్డిగారింటికి వెళ్లాను. ఆయనకు ఫోన్ వుంది. ఫోన్‌చేస్తే ఎమ్మెల్యేగారు దొరికారు. విషయమంతా చెప్పి, "నేను పంపిన అబ్బాయి చాలా బీదకుటుంబం నుంచి వచ్చినవాడు, మీరు సాయం చెయ్యగలిగితే చాలా సంతోషిస్తాను" అన్నాను. కులం, మతం మరేదైనా సరే అర్హత కావచ్చునేమో కాని బీదతనమన్నది ఉద్యోగానికి అర్హత కాదేమో! ఎమ్మెల్యేగారి నుంచి నెగెటివ్ సమాధానం వచ్చింది.

"ఎక్స్‌ట్రీమ్‌లీ సారీ. ఆ ఉద్యోగం ముందే మరొకరికి ప్రామిస్ చేశాను. మీతో అబద్దాలు చెప్పడం మంచిదిగాదు. ఆ అబ్బాయికీ ఉద్యోగం రాదు" అని ఫక్షన్‌కింద పెట్టేశాడు. కనీసం వాస్తవం చెప్పినందుకు అతణ్ణి అభినందించాలి. నిజం చెప్పడమన్నది రాజకీయనాయకుడి డిక్షనరీలో ఉండదు. ఏదియేమైనా నా ప్రయత్నం విఫలమైనందుకు చాలా బాధ కలిగింది.

మూడు రోజుల తర్వాత ఆ అబ్బాయి వచ్చాడు. పలకరింపుగా ఒక చిరునవ్వు నవ్వాను. మనిషి బాగా ఉత్సాహంగా కనిపించాడు.

"మీ ఉత్తరం ఇచ్చాను సార్. ఉత్తరం చదువుకొన్నాడో లేదో వెంటనే నా పేరు డైరీలో నోట్ చేసుకున్నాడు. రెకమెండ్ తప్పకచేస్తాను. ఆ పైన నీ అదృష్టం అని కూడా అన్నాడు సార్" అంటూ సంతోషంగా చెప్పాడు. నా ముఖం వివర్ణమైపోయింది. వాస్తవం చెబుదామనుకున్నాను. నాలుకమీదికి వచ్చింది. కానీ ఎందుకో చెప్పబుద్ధికాలేదు. భ్రమతొలగించి అతన్ని నిస్పృహలో ముంచడం నాకిష్టం లేదు. ఇంటర్వ్యూ తర్వాత నిజం ఎలాగూ బయటపడిపోతుంది. తప్పదు. అంతవరకూ ఆ అబ్బాయిని కలల ప్రపంచంలో బ్రతకనివ్వడం మంచిదనిపించింది.

"అలాగా. మంచిదే" అన్నాను.

"మీ నాన్నగారికి పెరాలసిస్ అన్నావు గదా. ఎట్లావుంది."

"మందులన్నీ పుట్టలో పోసినట్లుగావుంది. నయం అనిపించడంలేదు" దిగులుగా అన్నాడు.

"ఏం మందులు వాడుతున్నారు? అల్లోపతినా? మందుల ప్రపంచం ఇప్పుడు ఎంతో అభివృద్ధి సాధించిందంటున్నారే అంతా వాటికిప్పుడు చాలా రోగాలు లొంగిపోతున్నయే."

"అన్నీ వున్నా అల్లుని నోట్లో శని అని అల్లోపతి మందులు వాడడం నాబోటి వాడికెక్కడ సాధ్యపడుతుంది సార్. నాటువైద్యం చేయిస్తున్నాం. అదే 'కలికిరి' వైద్యం. మొత్తానికి నేనూ మా నాన్నా

ఇద్దరం కూడా అమ్మకు గుదిబండల్లా తయారయ్యాం. ఈ వత్తిళ్ళతో ఆమెకూడా ఎక్కడ జబ్బు పడిపోతుందోనని నాభయం" బాధగా అన్నాడు.

"బాధపడి చెయ్యగలిగిందేముందయ్యా" అన్నాను ఓదార్పుగా.

ఆ తర్వాత ఇద్దరం కాసేపు లోకపురాణం మాట్లాడుకున్నాక అతను సెలవుతీసుకొని వెళ్ళిపోయాడు.

నేను కండువా వేసుకొని బయటకు బయలుదేరబోతున్నాను. మా ఆవిడ వచ్చింది.

"ఆ అబ్బాయికి ఉద్యోగమొచ్చే మార్గమేదన్నావుంటే చూడండి. పాపం! అబ్బాయి లక్షణంగా వున్నాడు" అంది.

"పాపం. అబ్బాయి లక్షణంగా వున్నాడంటున్నావు. అంటే?"

"ములుగర్రతో పొడిస్తే గొడ్డుకు చురుకుపడుతుంది. ముందుకు దూకుతుంది. మీకు ఎన్ని మాటలన్నా చురుకులేదు. గుండ్రాయికి చక్కిలిగింతలు పెట్టినట్లే. వృధా. అమ్మాయి ఒకటి పెళ్ళికి ఉన్నదన్న స్పృహ మీకు లేకపోయినాక ఏమని ఏం లాభం. ఇరుగునూ పొరుగునూ చూసైనా నేర్చుకోరు" అంటూ విసవిసా ఇంట్లోకి వెళ్ళిపోయింది.

సుఖాలు అన్నీ ఒకరకంగా వుంటాయి. కానీ కష్టాలు రకరకాలు. మా ఆవిడ కష్టం మా ఆవిడది.

☆ ☆ ☆

ఇదంతా మూడు సంవత్సరాల కిందటి సంగతి. తర్వాత ఆ అబ్బాయి నాకు కనిపించలేదు. అతను నా స్మృతిపథం నుంచి పూర్తిగా జారిపోయాడు కూడాను.

పోయిన నెలలో బెంగుళూరు ప్రయాణం తగిలింది నాకు. నేను బస్సు ఎక్కగానే ఆ అబ్బాయి బస్సులో కనిపించాడు.

"బాగున్నారా సార్" అంటూ పలకరించాడు.

"ఇదిగో ఇలా వున్నాను. నీవు బాగున్నావా" అంటూ నవ్వాను.

అంతకంటే ఎక్కువ మాట్లాడటానికి బస్సులో కుదరలేదు. బస్సు దిగగానే నా దగ్గరికి వచ్చి, "ఏ లాడ్జిలో దిగుతారు సార్" అన్నాడు. "బెంగుళూరు నాకు కొత్త. అదే ఆలోచిస్తున్నాను." అన్నాను.

"మీకు అభ్యంతరం లేకపోతే నా వెంటరండి సార్. నా రూములో ఉందురుగాని" అంటూ చేతిలోవున్న బ్రీఫ్‌కేస్ లాక్కొని ఆటోవాడికి యిచ్చాడు.

లాడ్జికి వెళ్లగానే స్నానంచేసి బట్టలు మార్చుకున్నాను.

"నా మిత్రుడొకరు కాన్సర్ హాస్పిటల్‌లో వుంటే చూడటానికి వచ్చాను. ఆ పనిమీదే వెళ్తున్నాను. నేను వచ్చేసరికి ఏ పదకొండో పండ్రెండో కావచ్చు. నువ్వు పనిమీద ఎక్కడికైనా వెళ్ళేటట్లయితే 'కీ' కౌంటరులో ఇచ్చిపో" అన్నాను.

"మంచిది సార్. మీరు వస్తూ వస్తూ మధ్యలో ఏ హోటల్లోనన్నా భోం చెయ్యకండి" అన్నాడు.

"నాకోసం వెయిట్ చెయ్యకు. భోజనానిదేముంది. దారిలో ఎక్కడో భోంచేసి వస్తాను" అన్నాను.

"దయచేసి మీరు ఇక్కడికే రండి. మీరు ఏమీ అనుకోకపోతే నాదొక అభ్యర్థన"అంటూ ఏదో చెప్పడానికి తటపటాయించాడు.

"ఏమిటిది?"

"మీరు హాళికులన్న విషయం నాకు తెలుసు. ఆల్కహాళికులన్న విషయం విన్నాను. మీరు అభ్యంతర పెట్టకండి. మీరు వచ్చేసరికి ఏర్పాటు చేసి వుంచుతాను" అన్నాడు.

నేను గతుక్కుమన్నాను. ప్రొహిబిషన్ వచ్చిన తర్వాత నేను పూర్తిగా ఆ అలవాటు మానుకున్నాను. అతనితో ఏమి చెప్పాలా అని ఆలోచిస్తున్నాను.

"సత్కథకుల్ హాళికులైననేమి, ఆల్కహాళికులైననేమి? సందేహించకండిసార్" అంటూ ఒక ఛలోక్తి విసిరాడు. అతని అభ్యర్థనకు సరేననక తప్పలేదు.

హాస్పిటల్‌కు నడిచే వెళ్లామనుకున్నాను. ఆకాశం మబ్బులుపట్టి వాతావరణం చాలా ఆహ్లాదకరంగా వుంది. నడిచి వెళ్లడమే హాయి అనిపించింది. కానీ అతడు ఆటో మాట్లాడి బలవంతంగా నన్ను అందులో ఎక్కించాడు.

ఆటో పరుగెడుతోంది. నాకు మనసులో ఏదో ఆందోళన, అలజడి. హాస్పిటల్‌లో బాలగోపాల్ స్థితి ఎలావుందో ఏమో. అతను సీరియస్ కండిషన్‌లో వున్నాడన్న విషయం వారం కిందటే తెలిసింది. పనుల ఒత్తిడి. ముందే బయలుదేరడానికి వీలయిందికాదు. అతను నాకు ఆత్మబంధువు. గోపీ లాగే నాకు అతనితో యాదృచ్ఛికంగా పరిచయమయింది. రెండేళ్ళక్రితం రికార్డింగుకని రేడియో స్టేషన్‌కు వెళితే అక్కడ తగిలాడు. నా కథ రికార్డింగ్ కన్నా ముందే అతని పద్యాలు రికార్డింగ్‌వుంది. ఏమీ తోచక రికార్డింగ్ చేస్తున్న ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌తోబాటు రికార్డింగ్‌రూంలో కూర్చొని అతని పద్యాలు విన్నాను. హరిశ్చంద్రలోని కాటిసీను పద్యాలు, చక్కటి గాత్ర సంస్కారం, రసస్ఫోరకంగా పద్యాలు చదివాడు. రికార్డింగ్ పూర్తి అయిన తర్వాత ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ అతణ్ణి నాకు పరిచయం చేశాడు.

"ఏం చేస్తుంటావ్?" అడిగాను.

"రంగస్థల నటుణ్ణి" చెప్పాడు.

"నీ పద్యాలు నన్ను మంత్రముగ్ధుణ్ణి చేశాయి" అన్నాను.

అతను చాలా సంబరపడిపోయాడు. అతనితో నా పరిచయం అలా మొదలై నాకు ఆత్మబంధువుగా మారిపోయాడు. తీరిక దొరికితేచాలు మా వూరికి వచ్చేవాడు. పద్యాలు చదివి వినిపించేవాడు. ఆటో పరుగెడుతున్నంతసేపూ పాతజ్ఞాపకాలు నెమరువేసుకుంటున్నాను.

హాస్పిటల్‌కు వెళ్లేసరికి అతను మగతగా మంచంమీద పడుకొని వున్నాడు. మంచం పక్కన విషాదంగా లక్ష్మి కూచొని శూన్యంలోకి చూస్తోంది. నన్ను చూచి యాంత్రికంగాలేచి నిలబడింది.

"ఎలా వుందమ్మా" అన్నాను.

ఆమె గొంతుపెగల్లేదు. ఏదో గొణిగింది. అలికిడివిని బాలగోపాల్ కళ్లు తెరిచాడు. నన్నుచూచి ప్రయత్నం మీద లేచి కూర్చొని,

"వచ్చారా గురువుగారూ. చచ్చేలోపల మిమ్మల్ని చూస్తానో లేదో అనుకున్నాను" అన్నాడు.

"ఛీ అదేం మాట" అన్నాను.

"ఐపోయింది గురువుగారూ. రోజులు లెక్కపెడుతున్నాను" అన్నాడు.

లక్ష్మి అటువైపు తిరిగి వచ్చే దుఃఖాన్ని ఆపడానికి పైటచెంగు నోటికి అడ్డంపెట్టుకున్నది. నాకు నోటమాట రాలేదు. కాసేపు మా మధ్య భయంకరమైన నిశ్శబ్దం.

"మీ నాన్నగారు రాలేదా?" అన్నాను.

రాలేదన్నట్లు బాలగోపాల్ తల అడ్డంగా వూపాడు. కొడుకు సంపాదనాపరుడు కాలేదని ఆ పితృదేవునికోపం. కొడుకుతో ఏనాడో సంబంధాలు వదులుకున్నాడు. కొడుకు ప్రసక్తి ఆయన ఎదుటతెస్తే కూడా మండిపడేవాడు. నేనొకసారి ఖర్మం చాలక ఆయనతో బాలగోపాల్‌ని గురించి మాట్లాడుతూ,

"మీవాడు మీరు గర్వించదగిన గొప్ప కళాకారుడయ్యా" అన్నాను.

ఆయన ఇంతెత్తున ఎగిరి, "వాణ్ణి మీరే మెచ్చుకోవాలి. వాడొట్టి దద్దమ్మ. పగటి పూటకు పనికిరాడు. రేయిపూటకూ పనికిరాడు."

నాకు నవ్వు వచ్చింది. లక్ష్మి కూడా రంగస్థల నటి. వాడు ఆ అమ్మాయికి తాళికట్టి తలంబ్రాలు పోయకపోయినా కలిసి జీవిస్తున్నాడు. రేయిపూటకి పనికొస్తాడో లేదో చెప్పవలసింది ఆ అమ్మాయి.

దాదాపు రెండు మూడు గంటలు మాట్లాడి సెలవు తీసుకుని బయటకు వచ్చాను. ఆ అమ్మాయి లక్ష్మి నన్ను సాగనంపడానికి బయటకు వచ్చింది. ఏదో అడగాలని సంశయిస్తున్నట్లుగా వుంది.

"ఏమిటమ్మా విషయం చెప్పు" నేనే కదిపాను.

"ఏం లేదండీ. మనిషి చూడడానికి బాగానే కనిపిస్తున్నాడు. కానీ ఐదారు రోజుల్లోపల ఎప్పుడైనా ప్రాణం పోవచ్చని నాతో డాక్టరుగారు చెప్పారు. చస్తే శవాన్ని ఇక్కడే వదిలిపెట్టి వెళ్లలేను గదా!"

"శవాన్ని జీపులో మా వూరికి తీసుకెళ్ళడానికి డబ్బుల్లేవు" అంటూ భోరున యేడ్చింది.

"ఏడవకమ్మా, ఇంటికి వెళ్ళగానే డబ్బులు పంపుతాను" అన్నాను.

ఆ అమ్మాయి కొంగుతో కన్నీళ్లు తుడుచుకుంటూ లోపలికి వెళ్లింది.

ఆటో తీసుకొని రూము చేరుకొనేసరికి గోపిలేడు. మంచానికి అడ్డంగా పడిపోయాను. కళ్ళు మూసుకున్నా తెరచినా బాలగోపాల్ కళ్లముందు మెదులుతున్నాయన్న భావన భరింపశక్యంగాకుండా ఉంది. గుండెపట్టి ఎవరో లాగుతున్నట్లు అనిపించింది. చాలాసేపటి తర్వాత గోపి వచ్చి మెల్లగాతట్టి,

"లేవండిసార్" బాత్‌రూంలోకెళ్లి ముఖం కడుక్కుని రండి అన్నాడు.

గోపి చెప్పిందాంట్లో కొంత వాస్తవంవుంది. అదీగాక నా కోసమని కేవలం నాకోసమని అతను చేసిన ఏర్పాట్లను తిరస్కరించడానికి మనస్కరించలేదు. బాత్‌రూంకు వెళ్ళి ముఖం కడుక్కుని వచ్చి

కూర్చున్నాను. చాలా ఖరీదయిన ఏర్పాట్లే చేశాడు. ఇద్దరం తాగుతూ కూర్చున్నాం. కొంచెంసేపు ఇద్దరి మధ్య మాటా పలుకూ లేదు. గోపీ నిశ్శబ్దాన్ని భరించలేకపోయాడు.

"అడగటం మరిచానుసార్. పేషంట్ పరిస్థితి ఎలా వుంది" అన్నాడు.

"రోజులు లెక్కపెడుతున్నాడు" అన్నాను దిగులుగా.

బాలగోపాల్‌ను గురించి గోపీకి చెప్పాను బరువెక్కిన హృదయంతో.

అంతావిని గోపీ, "వ్యక్తిగతంగా ఆయన నాకు తెలియదు కాని రంగస్థల నటుడుగా ఆయన నాకు బాగా తెలుసు. ఆ మాటకొస్తే మన ప్రాంతంలో అతన్ని గురించి తెలియని వాళ్లెవరుసార్. ఈ విషయం మీకు, నాకు ముందే చెప్పివుంటే మీతోపాటు నేనుకూడా వచ్చి చూచి వుండేవాణ్ణి కదా" అన్నాడు ఒక దీర్ఘమైన నిట్టూర్పు విడిచి.

"అతను తన గాత్ర సంపదనుచూచి మురిసిపోయాడు గాని సంపాదనను గూర్చి పట్టించుకున్నవాడు కాదు. ఇవ్వాళ అతను చస్తే శవాన్ని కొంపకు చేర్చడానికి దారిలేక పెళ్లాం బాధపడుతున్నది" అంటూ విషయం చెప్పాను.

నేను చెప్పేది విని గోపీ స్టన్ అయ్యాడు. సిప్ చెయ్యబోయిన విస్కీగ్లాసుని పక్కకుపెట్టి, "నిజంగా ఆమె అంత నిస్సహాయస్థితిలో వుందాసార్ అన్నాడు గుండెబరువుతో.

ఔనన్నట్లు తలూపి, "ఊరికివెళ్లి ఏదోరకంగా ఆమెకు డబ్బు అందేటట్లు చేస్తాను. అంతవరకు నాకు మనశ్శాంతి వుండదు" అన్నాను.

"మీరేం వర్రీ కాకండి సార్. రేపు ఉదయమే ఆమెకు డబ్బు నేను సర్దుతాను" అన్నాడు గోపీ.

గురజాడ డైరీల్లో ఎక్కడో నేను చదివిన ఒక వాక్యం జ్ఞాపకానికి వచ్చింది. "లిక్కర్ మేక్స్ ఏ మాన్ జనరస్" అన్నది ఆ వాక్యం. తాగిన మత్తులో గోపీ అలా అనడం లేదు కదా అన్న సందేహం కలిగింది. లేకపోతే ముక్కు ముఖమూ తెలియని వ్యక్తికి అతను డబ్బు సర్దుబాటు చేయడమేమిటి?

"ఏమిటిసార్ ఆలోచిస్తున్నారు"

"ఏమీ లేదు" అన్నాను.

"డబ్బు పాపిష్టిది. అవసరాన్నిమించి దాన్ని ఎప్పుడూ నా దగ్గర ఉంచుకోను. ఇవ్వాళ నా దగ్గర అవసరాలకు మించి ఉంది. అది ఆమె అవసరాలకు సర్దడం మూలంగా సద్వినియోగం అవుతుంది."

గోపీ నా ఆలోచనలను కనుక్కున్నట్టుగా సమాధానం చెప్పాడు. కానీ అతడొక నిరుద్యోగి అని, దరిద్రంతో బాధపడుతున్నాడని నేననుకున్నాను. అతని దగ్గర అవసరాన్నిమించి డబ్బు ఎలా సమకూడిందో నాకు బోధపడని విషయం.

"ఏదన్నా వ్యాపారం చేస్తున్నావా?" అని అడిగాను.

"అవున్సార్"

"ఏం వ్యాపారం"

అతను కాసేపు మౌనం వహించాడు. గ్లాసు నిండావున్న విస్కీ గల్ఫ్ కొట్టాడు. ఖాళీ గ్లాసు టేబుల్‌మీద పెట్టి అన్నాడు.

"బెంగుళూరు నుంచి మన ప్రాంతాలకు దొంగరవాణా చేసే వ్యాపారం"

నేనేం మాట్లాడలేదు. గ్లాసులో వున్న విస్కీ ఖాళీచేసి గ్లాసు బోర్లించాను టేబుల్‌మీద.

"నన్ను అసహ్యించుకుంటున్నారా సార్" అన్నాడు.

"లేదు. నా దృష్టిలో అసహ్యించుకోవలసింది ఇందులో ఏమీ లేదు."

కాకపోతే ఇందులో ఉన్న రిస్కును చూచి బాధపడుతున్నాను అన్నాను.

"జీవితం ఒక రిస్కు అయిన వాడికి ఈ రిస్కు ఒక లెక్కలోది కాదు. ఈ రిస్కు తీసుకోకపోతే హాస్పిటల్‌లోవున్న మీ మిత్రుడు బాలగోపాల్ దయనీయస్థితే నాకు దాపురిస్తుంది. తప్పదు. అందుకు నాలోవున్న ఉడుకురక్తం సిద్ధంగా లేదు" అంటూ మంచంమీద వాలిపోయాడు.

☆ ☆ ☆

మా శ్రీమతి పేపరు చూస్తూవున్నట్టుండి, "ఈ చోద్యం చూశారా?" అంది ఏ రైలు ప్రమాదంలోనో, బోటు ప్రమాదంలోనో, వరదలో జనం చచ్చివుంటారు. అది ఆవిడకు చోద్యం.

"ఎంతమంది" అన్నాను మామూలుగా.

"ఇద్దరు" అంది.

"ఇద్దరే గదా" అన్నాను నిర్లిప్తంగా.

"మీరేం మనుషులండీ. ఈ పేపరు చూడండి. మీకే తెలుస్తుంది" అంటూ పేపరు నా ముందుంచింది.

పత్రికచూచి అప్రతిభుణ్ణయిపోయాను. రక్తపు మడుగులో గోపీ శీర్షిక చూచాను. రాయచోటి కొండల్లో ఎన్‌కౌంటర్ ఇద్దరి మృతి అని వుంది. ఆ దశకి గోపీ ఎప్పుడు చేరుకున్నాడో నేనూహించని విషయం. నా కళ్ళు చెమ్మగిల్లాయి.

☆ ☆ ☆

(ప్రఖ్యాత కథకుడూ, విమర్శకుడూ అయిన రా.రా. వర్ధంతి సందర్భంగా (24.11.96) ఈ కథ ఆయన స్మృతికి.........)

**- (1997, ఆహ్వానం)**